ప్రజల కోసం సైన్స్..　　ప్రగతి కోసం సైన్స్..　　స్వావలంబన కోసం సైన్స్..


# దేశవ్యాప్త శాస్త్ర ప్రచార ఉద్యమం

**నవంబరు 7, 2023 నుండి ఫిబ్రవరి 28, 2024 వరకు**

**జనవిజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్**









*శాస్త్రీయతకు 'hi' చెప్పండి.*

*సూడో సైన్స్ కు 'no' చెప్పండి.*

*సైన్స్ కు 'సై' చెప్పండి..*

*శాస్త్ర ప్రచార ఉద్యమానికి 'జై' చెప్పండి.*

*దేశం కోసం సైన్స్ అని చాటండి..*

**యువతీ యువకుల్లారా, మిత్రులారా,**

జనవిజ్ఞాన వేదిక మిమ్మల్ని అందరిని, దేశవ్యాపిత శాస్త్రీయ భావాల ఉద్యమంలోకి ఆహ్వానిస్తున్నది. ఈ దేశాన్ని ఆధునిక దేశంగా, అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలి. 70%గా ఉన్న యువతీ యువకుల శక్తిసామర్థ్యాలను ఉపయోగించుకోవడమే ఇందుకుమార్గం. ఇందుకు వారిలో పెద్ద ఎత్తున శాస్త్రీయ ఆలోచనలను పెంచాలి. వారి సాంకేతిక సామర్థ్యాలను అభివృద్ధి చేయాలి. మనపాఠశాల లు,కళాశాలలు,యూనివర్సిటీలు,ఇంజనీరింగ్ కాలేజీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలను,ఏ దేశానికి కూడా తీసుపోని విధంగా తీర్చిదిద్దాలి. అందుకు ఎటువంటి పాలసీలు కావాలి? ఎంత నిధులు అవసరం? లాంటి అంశాలపై చర్చ జరగాలి. అందుకోసమే ఈ శాస్త్ర ప్రచార ఉద్యమం.

దేశంలో నిజమైన మార్పు రావాలంటే, సైన్స్ భావాలు ప్రజల్లో కూడా పెరగాలి. మన రాజ్యాంగం కూడా దీన్ని  నిర్దేశిస్తున్నది. కానీ అధికార స్థానాలలో ఉన్న వారే మూఢనమ్మకాలను ప్రచారంలో పెడుతున్నారు. ఆస్ట్రాలజీని కోర్సుగా చేర్చారు. సైన్స్ బోధనను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారు. డార్విన్ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్‌ను సిలబస్ నుండి తొలగిస్తున్నారు. దశాబ్దాలుగా సైన్సు ప్రచార సంస్థగా ఉన్న విజ్ఞాన్ ప్రసార్‌ను కేంద్ర ప్రభుత్వం మూసివేసింది. ఏళ్ల తరబడిగా శాస్త్రవేత్తలకు ఇస్తున్న అవార్డులను రద్దు చేశారు. వందేళ్లుగా జరుగుతున్న జాతీయ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలకు నిధులను తగ్గించి వేశారు. ఈ సంవత్సరం (2024) ఈ సమావేశాలు ఎక్కడ జరుగుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది.


ఇక, యాంటీ సైన్స్‌ను, సూడో సైన్సును నాయకులే ప్రచారం చేస్తున్నారు. పౌరాణిక కథలను వల్లించి, ఇదే సైన్సు అంటున్నారు. వాస్తవాలను చెప్పడం కాకుండా భ్రమల్లో ప్రజలను పెడుతున్నారు. జీవితంలోని అసలు సమస్యల పరిష్కారాల వైపు కాకుండా, ఆవేశాల వైపు, విద్వేషాల వైపు ప్రజలను నడుపుతున్నారు.

ఇవన్నీ కూడా సైన్స్‌కు, హేతుబద్ధమైన ఆలోచనలకు అడ్డంకులు అవుతున్నాయి. ఈ అంశాలన్నీ ప్రజలతో చర్చించడానికి జరుగుతున్నదే ఈ శాస్త్ర ప్రచార ఉద్యమం.

సైన్స్ గమనాన్ని ఈరోజు కార్పొరేట్ సంస్థలు నిర్ణయిస్తున్నాయి. విజ్ఞానాన్ని బంధించి, అంతులేని తమ లాభాల కోసం ఉపయోగించుకుంటున్నాయి. వేల సంవత్సరాలుగా, ప్రజల అనుభవం నుంచి, విజ్ఞానుల కృషి నుంచి సైన్స్ ఆవిర్భవించింది. కానీ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ

రైట్స్ పేరుతో, విజ్ఞాన ఫలాలు ప్రజలందరికీ అందుబాటులోకి రాకుండా, ఈ సంస్థలు అడ్డుపడుతున్నాయి. ప్రభుత్వాలు కూడా వీటిపై చర్య తీసుకోవడానికి భయపడుతున్నాయి. దేశం తన కాళ్లపై తను నిలబడాలంటే, స్వావలంబన సాధించాలంటే, కార్పొరేట్ కంపెనీలను ప్రభుత్వాలే నియంత్రించాల్సిన అవసరం ఉంది. భారతదేశానికి ఖ్యాతి తెచ్చిన ఇస్రోలో కూడా ప్రైవేట్ వ్యాపార శక్తుల ప్రాబల్యం పెరుగుతోంది.

ఈ విషయాలన్నీ చర్చించడానికే ఈ శాస్త్ర ప్రచార ఉద్యమం.



ఈరోజు ప్రపంచం క్లైమేట్ ఛేంజ్ అనే పెద్ద ముప్పును ఎదుర్కొంటున్నది. అభివృద్ధి చెందిన దేశాలు భూతాపం లేదా గ్లోబల్ వార్మింగ్‌కు ముఖ్య కారణాలవుతున్నాయి. సైన్సు ఈ ప్రమాదాన్ని ముందే హెచ్చరించినా, వారు ఖాతరు చేయలేదు. చివరికి సైన్సు చెప్పిందే నిరూపణ అయింది. అనేక దేశాలలో విద్యార్థులే ఈరోజు గ్లోబల్ వార్మింగ్‌పై ఉద్య మిస్తున్నారు. ఈ రోజు మనం చూస్తున్న తుఫాన్లు కరువులు అకాల వర్షాలు అన్నీ క్లైమేట్ ఛేంజ్ దుష్ఫలితాలే. ఈ అంశాలన్నీ చర్చించడానికే ఈ శాస్త్ర ప్రచార ఉద్యమం.

ఆధునిక సాంకేతిక సాధనాలు ప్రజల మధ్య ఉమ్మడి సంబంధాలకు నేడు అవసరం. అట్లే శాస్త్రీయ ఆలోచనలు ప్రజల మధ్య ఐక్యతకు ఉపయోగపడాలి. ఈ దేశం ముందుకు పోవాలంటే, కుల మతాల వివక్షలు పోవాలి. మనుషులంతా ఒకటే అని జన్యు శాస్త్రం చెబుతుంది. **'మతములన్నియు మాసిపోవును, జ్ఞానం ఒక్కటే నిలిచి వెలుగును'** అని తెలుగువారి మహాకవి గురజాడ అన్నారు. ఆ స్ఫూర్తి ఈరోజు మనందరికీ కావాలి. వీటి సెలబ్రేషనే ఈ శాస్త్ర ప్రచార ఉద్యమం.

భారతదేశంలో సాంఖ్య, చార్వాక, బౌద్ధ, ఆర్యభట్ట కాలాలలో గొప్ప సత్యాన్వేషణ, భావ సంఘర్షణ ఉండేది. ఆ స్ఫూర్తి నేడు కూడా అవసరం. అందుకు, ప్రశ్నలను ఆహ్వానించే వైవిధ్య భరితమైన వాతావరణం ఉండాలి. ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం ప్రశ్నలను వికసింపజేస్తాయి. ఉన్న పరిస్థితిని (status quo) ప్రశ్నించడం నుండే సైన్సు ముందుకు పోతుంది. **ప్రశ్న లేకపోతే సైన్స్ లేదు.**

మిత్రులారా, ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా నవంబర్ 7 (సి.వి.రామన్ జన్మదినం)న ప్రారంభమైంది. 2024 ఫిబ్రవరి 28 (జాతీయ సైన్స్ దినం)న ముగుస్తుంది. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ (AIPSN) లో ఉన్న 28 సంస్థల ఇందులో పాల్గొంటున్నాయి. అన్ని రాష్ట్రాలలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. సభలు, సమావేశాలు, సదస్సులు, సెమినార్లు వివిధ అంశాలపై జరుగుతున్నాయి. శాస్త్రవేత్తల జీవితాల గురించి విద్యార్థులకు తెలియజేస్తున్నారు. మన రాష్ట్రంలో ఇప్పటికే, నాలుగున్నర లక్షల మంది హై స్కూల్ విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని పరిచయం చేశారు. 500 మండలాలలో, ఈ కార్యక్రమాలు జరిగాయి.


రాష్ట్రం లోని 26 జిల్లాలలో, ప్రదర్శనలు ఇస్తూ, జన విజ్ఞాన వేదిక కళాకారుల బృందం ఈ సందర్భంగా, **శాస్త్ర విజ్ఞాన కళాయాత్ర** పేరుతో ఫిబ్రవరిలో పర్యటించనున్నది. ఫిబ్రవరి 28న, కలకత్తాలో జరిగే జాతీయ సదస్సుతో ఈ క్యాంపెయిన్ ముగుస్తుంది.

***మా విజ్ఞప్తి :*** *విద్యార్థులు,ఉపాధ్యాయులు అధ్యాపకులు మేధావులు పౌరులూ, అందరూ ఇందులో పాల్గొవాలని జన విజ్ఞాన వేదిక ఆహ్వానిస్తున్నది. విద్యాసంస్థలు సహాయ సహకారాలు అందిచాలని విజ్ఞప్తి చేస్తున్నది.*


*జిల్లాలలో ఉన్న ప్రముఖులు, సైన్స్ అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నాయకుల సహకారాన్ని కోరుతున్నది.*

**శాస్త్రీయ ఆలోచనే .. సమాజ సమగ్రాభివృద్ధికి మార్గం.**

***Science for Democracy.Science for Secularism.***





విజ్ఞానాభినందనాలతో...

**జనవిజ్ఞాన వేదిక**
**ఆంధ్రప్రదేశ్**

(AIPSN అనుబంధం)

ఫోన్స్ : 9490098919 9490300442 9849804467